


## జరిగిన జగన్నాటకం

సవ్యలంకలో కుడి చేతిని వాడి, మరణదండన నుంచి తప్పించుకున్నాడు బోసు. భవిష్యజ్ఞాన గ్రంథంలో చెప్పబడిన మహాబసు బోసేనని అతణ్ణి నాయకుణ్ణి చేశారు. వామదేవుడు సత్యోద్యమకారులను హతమార్చడంతో శాంతిపోరాటం సాయుధపోరాటంగా మారింది. కుడిచేతి వాటం వున్న రణచండి దేవత విగ్రహాలను చూశాక ఎడమ చేతి వాడకం స్వాభావికం కాదని తెలుసుకున్నారు. వామదేవుడి గూఢచారి ఉదంతుడు బోసు పోరాటంలో చేరాడు. మహాబసుగా తన అనుభవాలన్నింటినీ డా. నరసింహంకి చెప్పాడు సారథి. దక్షిణావతం వెళ్ళాలా లేదా అన్న విషయమై సైన్యం రెండు భాగాలుగా విడిపోయింది. పేరలల్ వరల్డ్స్ లో ప్రయాణం వల్ల సారథి సవ్యలంకకి వెళ్ళాడని డా. నరసింహం చెప్పాడు. మిగిలిన వాళ్ళు వ్యతిరేకిస్తున్నా వినకుండా వ్యాపారవేత్తల సమావేశానికి వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు బోసు. అక్కడ అతన్ని ఒంటరిగా ఒక గదిలో వుంచారు.

# 17

"బుద్ధం శరణం గఛ్ఛామి"

ఉలిక్కిపడి లేచాడు మహాబసు. ఎదురుగా వున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు. వ్యాపారవేత్తలతో సమావేశం కోసం బయల్దేరి వచ్చిన విషయం గుర్తింది. అయితే ఇప్పుడు ఎదురుగా నిలబడిన వ్యక్తి మాత్రం ఖచ్చితంగా వ్యాపారవేత్త కాదు. అమోఘమైన తేజస్సు. నిస్సందేహంగా ఎవరో మహారాజు. అతని బట్టలు, వేషధారణ చూస్తే ఇప్పటివాడిలా లేడు. ఎప్పుడో కొన్ని వందల ఏళ్ళు, లేదా వేల ఏళ్ళ క్రితం వ్యక్తిలా అనిపించాడు.

"మీరు?"

"నా పేరు ప్రియదర్శి. మగధ సామ్రాజ్యాధినేతను."

అర్థం కానట్టు అతని వైపే చూస్తూ వుండిపోయాడు మహాబసు. ఆ పేరు ఇంతకు ముందు విన్నట్లు అనిపిస్తోంది కానీ అది ఎవరి పేరో గుర్తురావటం లేదు. ఎదురుగా వున్న వ్యక్తి మాత్రం ప్రశాంతంమైన, నిర్మలమైన తన చిరునవ్వుని ప్రసరిస్తూనే వున్నాడు.

"బహుశా నీకు తెలిసిన పేరు అదై వుండదు. నాకు వున్న మరో పేరు అశోకుడు" అన్నాడు. బోసు ఆశ్చర్యంతో నోరు తెరుస్తూ చేతుల్ని మాత్రం అదే యాంత్రికతతో జోడించి నమస్కారం  చేశాడు. తిరిగి నమస్కారం చేశాడాయన.

"ఎంతదాకా వచ్చింది మీ పోరాటం?" అడిగాడాయన. మరింత ఆశ్చర్యపోయాడు మహాబసు.

"మీకు నా పోరాటం గురించి తెలుసా?" అడిగాడు

"తెలుసు కాబట్టే వచ్చాను. నీతో ఆ విషయాలు మాట్లాడాలనే కదా వచ్చాను. నీకు చెప్పాలని లేకపోతే చెప్పు వెళ్ళిపోతాను" అన్నాడాయన నవ్వుతూనే.

"మీకు చెప్పకుండా వుండాల్సినంత రహస్యమేమీ లేదు సమ్రాట్. చిన్న ఉద్యమంగా మొదలైన పోరాటం గెలుపు మలుపు దగ్గరకు వచ్చింది. విజయం వరించే మంచి రోజు మరెంతో దూరంలో లేదు."

ఆవేశంగా చెప్తున్న మహాబసుని చూసి అయన గట్టిగా నిట్టూర్చాడు. మహాబసు గొంతులో వున్న ఆత్మవిశ్వాసం కూడా అశోకుడికి సంతృప్తిని ఇవ్వలేకపోయింది. ఆ విషయం మహాబసుకి స్పష్టంగా అర్థమైంది.

"ఏమైంది సామ్రాట్?" అడిగాడు మహాబసు.

"విజయం అంటే విషాదం. విజయమంటే విలాపం. విజయం అంటే విలయం. అందుకే భయపడుతున్నాను. నా అనుభవం నుంచి చెప్తున్నాను. యుద్ధం వదిలెయ్. శాంతిని కోరుకో"

"శాంతిని కోరుకునే విషయంలో మీతో ఏకీభవిస్తాను. కానీ యుద్ధం రెండు వర్గాల మధ్య జరుగుతున్నప్పుడు రెండు వర్గాల మధ్య పరస్పర విరుద్ధమైన అభిప్రాయం ఏదో వుంటుంది కదా. అందులో ఎవరు విజయం సాధిస్తారో వాళ్ళ అభిప్రాయమే చలామణి అవుతుంది. అ వర్గానికే శాంతి చేకూరుతుంది. మా విజయం తదనంతరం కుడి చేతి వాటాన్ని సమర్థించే చట్టాన్ని అమలు చేసిన తరువాతే దేశానికి శాంతి, నాకు మనశ్శాంతి కలుగుతాయని అనుకుంటున్నాను"

అశోకుడు బాధగా చూశాడు. క్రమంగా ఆయన రూపం అదృశ్యం అవుతుండగా చెప్పాడు – "యుద్ధంలో గెలుపు మాత్రమే సాధ్యం. శాంతి స్థాపన కొంత వరకే సాధ్యం. మనశ్శాంతి పొందుతామని అనుకోవడం భ్రమ. జాగ్రత్త."

ఆయన ఇక లేడు.

మహాబసుకి మెలకువ వచ్చింది. ఎవరో ద్వారం పైన దబదబా కొట్టిన చప్పుడు. ఒకవేళ తనని అనుసరిస్తూ అనుచరులెవరైనా వచ్చారా అన్న అనుమానం వచ్చిందతనికి. వెళ్ళి తలుపు తీస్తే ఒక సిపాయి నిలబడి వున్నారు.

“మహాబసుగారికి జయం కలుగుగాక. వర్తక మహాసభకి మీమ్మల్ని సాదరంగా తోడ్కోని రమ్మని ఆజ్ఞ. మీరు త్వరగా సిద్ధమైతే తీసుకువెళ్తాను?” అన్నాడు వినయం ఉట్టిపడేలా. మహాబసు తలాడించి త్వరగా సిద్ధమై అతనితో కలిసి బయల్దేరాడు.

ఈ సమావేశం ఎప్పుడు ఎక్కడ జరగబోతోందో మహాబసుకి ఎలాంటి వర్తమానం లేదు. ఆయనకు తెలియపరిచే ప్రయత్నం చేస్తే అది కర్ణాకర్ణిగా ఇంకెవరికైనా చేతితే అది మహాబసు ప్రాణానికే ప్రమాదంగా పరిణమించవచ్చు. బహుశా ఆ విషయం తెలియడం వల్లేమో సమావేశం వివరాలన్నీ రహస్యంగానే వుంచారు. అందుకే రెండు రోజులు అతన్ని బందీలా వుంచారు. జరిగినదంతా మననం చేసుకోవడంతో ఈ విషయం అర్థం అయ్యింది మహాబసుకి. ఆ సమావేశాన్ని ఏర్పాటు చేసినవారికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

మహాబసు ఎక్కిన వాహనం ఎంతో వేగంతో కదిలిపోతోంది. బయల్దేరడానికి ముందు కనిపించిన అశోక చక్రవర్తి గుర్తుకువచ్చాడు. వెంటనే తనతో వున్న సిపాయిని రెండు ప్రశ్నలు అడిగాడు. –

“ప్రియదర్శిని సమ్రాట్ అశోకుడు తెలుసా” అని మొదటి ప్రశ్న, “మగధ సామ్రాజ్యం ఎక్కడుంది” అని రెండో ప్రశ్న. రెండు ప్రశ్నలకీ సిపాయి అయోమయంగా ముఖం పెట్టి తెలియదని తలాడించాడు. అది ఊహించిన జవాబే కావటంతో మహాబసు ఆ విషయాన్ని అంతగా పట్టించుకోకుండా వుండిపోయాడు.

“యుద్ధంతో మనశ్శాంతి పొందుతామని అనుకోవడం భ్రమ. జాగ్రత్త” అశోకుడి మాటలు జ్ఞాపకానికి వచ్చాయి. 'ఎందుకలా చెప్పాడా'ని ఆలోచించాడతను. అయితే అది ఎంతోసేపు కొనసాగలేదు. అసలు అది కలా లేక భ్రమా అను అనుమానం వచ్చింది. ఏదైనా వచ్చిన వ్యక్తి అశోకుడని మొదట తెలియదు. కాని ఆయన తన వివరాలు చెప్పిన తరువాత గుర్తించాడు. అంటే తనకి అశోకుడు అంటే ఎవరో, మగధరాజ్యమంటే ఏమిటో తెలుసు. కాని ఒకసారి ఆ కల ముగిసిపోయిన తరువాత అశోకుడు ఎవరో గుర్తుకురావటం లేదు. తను ఎక్కడినుంచి ఇక్కడికి వచ్చాడో తెలుసుకోడానికి ఇది చాలా మంచి మార్గంలా తోచింది.

“దయచేయండి మహాబసు” అన్నాడు సిపాయి. అప్పుడు తేరుకున్నాడు మహాబసు. ఎదురుగా పెద్ద ద్వారం తెరిచివుంది. దానికి రెండు వైపులా వున్న సైనికులు వినయంగా తలలు దించి నిలబడి వున్నారు. మహాబసు తన వాహనం దిగి నెమ్మదిగా నడుస్తూ లోపలికి అడుగుపెట్టాడు.

లోపల సమావేశానికి చేసిన ఏర్పాట్లు పరిశీలించాడు. కనీసం ఒక ముప్పై మంది వుంటారని అనిపించింది. అందరూ అప్పటికే ఏదో మాట్లాడుకుంటూ వున్నారు. మహాబసు రాకతో ఒక్కసారి నిశబ్దం ఆవహించి, మళ్ళీ అంతలోనే కలకలంగా మారిపోయింఇ. సిపాయి మహాబసుని ఆసనం దగ్గరకు చేర్చి వెళ్ళిపోయాడు. సభ ప్రారంభం చేసేందుకు అందరూ సిద్ధమౌతుండగా మహాబసు నిలబడ్డాడు. ఒక్కసారిగా సభ మొత్తం నిశ్శబ్దమైపోయింది. అతను ఏం చెప్తాడో అన్న కుతూహలం అందరి ముఖాలలో కనిపిస్తోంది.

“మీలో ఎవరికైనా సమ్రాట్ అశోకుడి గురించి కానీ, మగధ సామ్రాజ్యం గురించి కానీ తెలుసా?” అడిగాడు మహాబసు.

ఒక్కసారిగా కలకలం మొదలైంది. సమాధానం చెప్పడానికి ఎవరూ ముందుకి రాలేదు. అందరి ముఖాలలో అయోమయం తప్ప ఏ ఒక్కరిలోనూ సమాధానం తెలిసిన లక్షణం కనిపించలేదు. కొంత సమయం గడిచాక మళ్ళీ మహాబసునే మాట్లాడాడు. – “సరే ఆ విషయాన్ని వదిలిపెట్టి ఇక సభని ప్రారంభించండి” అని.

మహాబసుకి దగ్గరగా కూర్చోని వున్న వ్యక్తి భారంగా లేచి నిలబడ్డాడు. ఆయనను చూస్తే డెభై ఏళ్ళకు పైబడిన వయసు కనపడుతోంది. వయసుతో పాటు వచ్చిన వార్ధక్యం వల్ల కొంత ఇబ్బంది పడుతున్నా ఆయన ముఖంలో అనుభవం తెచ్చిపెట్టిన వెలుగు

ప్రస్ఫుటంగా కనపడుతోంది. నిలబడిన వెంటనే తాను కూర్చున్న ఆసనం వెనక్కి నడిచి, ఆ ఆసనాన్ని ఆసరాగా చేసుకోని నిలబడి గొంతు సవరించుకున్నాడాయన.

"అందరికీ నమస్కారం." అంటూ మహాబసు వైపు తిరిగి తనని పరిచయం చేసుకున్నాడు. "నా పేరు సిరిగిరి. సవ్యలంకలో ప్రతి వ్యాపారంలో నా భాగస్వామ్యముంది. మీరు ఎక్కడ ఏది కొనుక్కున్నా అందులో నా ప్రమేయం తప్పకుండా వుంటుంది. ఇదంతా నేను మూడు దశాబ్దాలుగా నిర్మించిన వ్యాపార సామ్రాజం. ఇప్పుడు నేను వ్యాపార వ్యవహారాలు చూసుకోవటం లేదు. నా కొడుకులు సిరివరం, సిరిచరం చూసుకుంటారు. నేను ఆధ్యాత్మికంగా బతుకుతున్నాను. అయితే ఇప్పుడు వచ్చిపడ్డ సమస్య చాలా పెద్దది. అది చర్చించడానికి ఈ పిల్లలు తమ శక్తియుక్తులు సరిపోవని నన్ను పెద్ద దిక్కుగా ఈ సమావేశానికి ఆహ్వానించారు. నా శక్తి మేర వాళ్ళ అభ్యర్ధనని మీకు విన్నవించే ప్రయత్నం చేస్తాను"

మహాబసుకి తన వివరాలు చెప్పిన తరువాత సిరిగిరి మిగిలిన సభ్యుల వైపు తిరిగాడు.

"మిత్రులారా ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం మీ అందరికీ తెలుసు. అయినా ఇక్కడికి వచ్చిన మహాబసుగారి కోసం వివరంగా చెప్పదలిచాను. గత కొంత కాలంగా సవ్యలంకలో జరుగుతున్న మార్పుల గురించి మనందరికీ తెలుసు. ఎడమ చేతిని వాడే మన లంకలో కుడి చేతి వాడకాన్ని పెంచాలన్న ఆశయంతో ఒక విప్లవం ఆరంభమైంది. అందుకు ముఖ్య కారణం మహాబసే అని కూడా నేను చెప్పాల్సిన పనిలేదు. అయితే మొదట చిన్న తిరుగుబాటుగా మొదలైన ఈ విప్లవం క్రమంగా ఒక పోరాటంగా రూపాంతరం చెందింది. ఇప్పుడు సవ్యలంకలో వున్న ప్రజలందరిలో కనీసం నలభై యాభై శాతం మంది కుడి చేతి వాడకాన్ని సమర్ధిస్తున్నారు. అంటే రాజ్య ప్రజలు కుడి ఎడమలుగా రెండుగా చీలిపోయారు." అంటూ ఆగాడాయన.

సభలో వున్న వారందరూ అంగీకారం తెలుపుతూ తల ఊపుతుంటే మహాబసు నమ్మలేనట్లుగా చూశాడు. ఉద్యమ ప్రభావం సామాన్య ప్రజలదాకా వెళ్ళిందన్న సంగతి తెలిసినప్పటికీ, అది ఇంత బలంగా వేళ్లూనుకుందని అతను ఊహించలేదు. అయితే ఆ అపనమ్మకాన్ని బయటికి కనిపించనీయకుండా మామూలుగా వుండటానికి ప్రయత్నించాడు.

"ఇక్కడ ఎడమ చేతిని సమర్ధించాలా కుడి చేతిని సమర్ధించాలా అన్నది కాదు మా సమస్య. ఎడమ చేతిని, కుడి చేతిని వాడేవాళ్ళుగా జనం విడిపోతే వ్యాపార సంస్థలు నడుపుకునే మేము ఏ వైపుకి వేళ్ళాలి. ఏది ఔనన్నా, ఏది కాదన్నా సగం ప్రజలకు వ్యతిరేకమౌతుంది. దానివల్ల మా వ్యాపారాలు, ఆదాయాల దెబ్బ తింటున్నాయి. అందు వల్ల –" ఆయన ఇంకా ఏదో చెప్పబోతుంటే మహాబసు ఆయన్ని వారించి తానే నిలబడ్డాడు.

"ఈ సమావేశం ఎందుకు జరుగుతోందో నాకు ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది. మీ వ్యాపార స్వార్ధ ప్రయోజానాల కోసం ప్రజలు కావాలనుకుంటున్న మార్పుని వ్యతిరేకిస్తున్నారు. ఉద్యమాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. అందుకు మీకు నా సహకారం కావాలి. అంతేనా?" అన్నాడు ఆవేశంగా. సిరిగిరి సమాధానంగా నవ్వాడు.

"వ్యాపారం అంటే అది సమాజ శ్రేయస్సుకోసం కాదని మీరు ఎందుకు అనుకుంటున్నారు. సమాజానికి ఉపయోగపడినిదే అయితే ఈ పాటికి అందరూ కలిసి నన్ను, నా వ్యాపారాన్ని అధ:పాతాళానికి తొక్కేసేవాళ్ళు. ఒకవేళ అలా జరగకపోయినా ఈ రాజ్యాన్ని పాలించే ప్రభువులు ప్రజలను ఇబ్బందిపెట్టే వాటిని ఇలా దశాబ్దాలు నిలువనిచ్చేవాళ్ళా? కాబట్టి వ్యాపారం కేవలం లాభాలకోసమే కానీ ప్రజల మంచి కోసం కాదన్న వాదనని మర్చిపో." చెప్పాడాయన

మహాబసు కొన్ని క్షణాలు మౌనంగా వున్నాడు. ఆ తరువాత తన వాదన వినిపించడం మొదలుపెట్టాడు.

"మీరు చెప్పింది నిజమే అనుకుందాం. సమాజానికి ఉపయోగపడనిదైతే ప్రజలే తిరస్కరిస్తారు అన్నది నిజమే అనుకోండి. అలాగైతే ఇప్పుడు ప్రజలు ఎడమ చేతి వాటాన్ని తిరస్కరిస్తున్నారు కాబట్టి అది సమాజానికి ఎలాంటి మంచి చెయ్యటం లేదని అనుకోవచ్చా? అదే నిజమైతే ఈ చర్చ జరపడంలో అర్థమే లేదు." అన్నాడు నింపాదిగా. అతని వాదనలో వున్న తర్కానికి సిరిగిరి అభినందనగా చూస్తే మిగిలిన వాళ్ళు మింగేసేటట్టు చూశారు. సిరిగిరి కొడుకు సిరివరం అందుకున్నాడు.

"సరే మీరు అన్నట్లు మంచి చెడు పక్కన పెడదాం. మా మా సంస్థల లాభాల కోసమైనా" కొనసాగించలేక ఆగిపోయాడతను.

"మీ లాభాల గురించి ఆలోచించాల్సిన అవసరం నాకుగానీ నా ఉద్యమానికి కానీ లేదు. ఇంత తీవ్రంగా చెప్తున్నానని అనుకోకండి. ఈ ఉద్యమానికీ, మీ వ్యాపారాలకి సంబంధం లేదు. మీరు అనవసరంగా భుజాలు తడుముకుంటున్నారు. మీ పనేదో మీరు చేసుకోండి. నా పని నన్ను చేసుకోనివ్వండి" అంటూనే లేచి చేతులు జోడించాడు మహాబసు. సిరివరం, సిరిచరం దురుసుగా లేచి నిలబడ్డారు. అందరి దృష్టి పెద్దవాడైన సిరిగిరి పైనే వుంది. ఆయన నెమ్మదిగా కదిలాడు.

"నాయనా మహాబసు. నేను పెద్దవాణ్ణి. నా వయసు అనుభవం రెండింటిని గౌరవించి నా మాటలు రెండు నిముషాలు విను. ఆ తరువాత నీ నిర్ణయం ఏదైనా సరే మేము గౌరవిస్తాము." అన్నాడు. కాదనడానికి మనసొప్పలేదు మహాబసుకి.

"అలాగే కానీ ఇద్దరం ఏకాంతంగా మాట్లాడుకుందాం." అంటూ సిరివరం, సిరిచరం వైపు చూశాడతను. వాళ్ళిద్దరి ముఖంలో కోపం ప్రస్ఫుటంగా కనపడుతోంది. మహాబసు కూడా చూపు స్థిరంగానే వుంచి – "మిగిలిన వారితో సంబంధం లేకుండా" అన్నాడు.

మరి కొద్దిసేపట్లో మహాబసు, సిరిగిరి మాట్లాడుకోడానికి ఏర్పాటు జరిగిపోయింది. ఇద్దరు అనుచరులు సహాయంతో సిరిగిరి ఆ గది వైపు కదిలాడు. మహాబసు కూడా లేచి వెళ్ళబోతుంటే అన్నదమ్ములిద్దరూ అడ్డం నిలబడ్డారు.

"మాకు అనుకూలంగా నిర్ణయం తీసుకోమని అర్థిస్తున్నామని అనుకుంటున్నావేమో. అలా నిర్ణయించడం మినహా వేరే మార్గం లేదని తెలుసుకుంటే మంచిది" అన్నాడు వరం.

"ప్రభుత్వాలు నడిచేది పదవులలో వున్న వారివల్ల కాదు. డబ్బుని సమకూర్చే మా లాంటివాళ్ళ వల్ల. ప్రభుత్వ ఆయుధగారమంతా మా డబ్బుతో తయారైనదే. ఆయుధాల తయారి, అమ్మకం పెంచితే చాలు, ఆనవాలు లేకుండా పోతారు. గుర్తుంచుకో" అన్నాడు చరం.

మహాబసు సమాధానం చెప్పేలోగే వాళ్ళిద్దరూ చెరోవైపుకి తప్పుకున్నారు. ఇక వాళ్ళతో మాట్లాడి ప్రయోజనం లేదనుకున్నాడేమో మహాబసు వడివడిగా అడుగులు వేసుకుంటూ సిరిగిరి ఆంతరంగిక మందిరం వైపు వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆయన గది చాలా స్వచ్ఛంగా వుంది. తెలుపు రంగు వస్తువులే ఎక్కువగా వున్నాయి. రకరకాల దేవుళ్ళ బొమ్మలు చుట్టూ వున్నాయి. సవ్యలంకకి మొదటిసారి వచ్చినప్పుడు ఒక గుడిలో చూసిన దేవుణ్ణి మాత్రం గుర్తుపట్టాడు. మనిషి శరీరం, పులి ముఖం, తోకతో కత్తిని పట్టుకోని. అతని పక్కనే వున్న బొమ్మ మాత్రం మిగిలిన దేవతలకి భిన్నంగా అనిపించింది. అందరు దేవుళ్ళు రకరకాల జంతు శరీర భాగాలతో వుంటూ ఆ ఒక్క బొమ్మలో దేవుడు మాత్రం మనిషి రూపంలో వున్నాడు. సవ్యలంకలో వుండే అందరిలానే వున్నాడు. కాకపోతే గుర్రం ఎక్కి పోరాటానికి వెళ్తున్న యోధుడిలా కుడి చేత్తో కత్తిని పైకి ఎత్తి పట్టుకోని, గుర్రం వెనుక కాళ్ళమీద నిలబడేలా పట్టుకోని వున్నాడు.

"ఏం చూస్తున్నావు మహాబసు" అని సిరిగిరి అనడం తో తదేకంగా ఆ బొమ్మలని చూస్తున్నానని తెలుసుకున్నాడు మహాబసు.

"ఈ దేవుడు ఎవరా అని. మిగిలిన వాళ్ళకి ఇలా పులి ముఖం, ఒంటె శరీరం, తాబేలు కాళ్ళు ఇలా వున్నాయి కానీ ఈయనకి అవేవీ లేవని చూస్తున్నాను. పైగా కుడి చేతితో కత్తిని పట్టుకున్నాడు."

సిరిగిరి గట్టిగా నవ్వాడు. లేచి దగ్గరగా వచ్చి ఆ బొమ్మని తాకి చిన్నగా తుడిచాడు.

"నీ బొమ్మని నువ్వే గుర్తు పట్టలేకపోతే ఎలా మహాబసు" అన్నాడాయన వణుకుతున్న కంఠంతో.

మహాబసు ఆశ్చర్యంగా ఆయన వైపు, ఆ బొమ్మ వైపు చూశాడు. నమ్మశక్యం కాని ఆ నిజాన్ని అర్థం చేసుకోడానికి అతనికి కొన్ని క్షణాలు పట్టింది. అతను తేరుకునేలోగా జరిగిందా సంఘటన. సిరిగిరి అమాంతంగా ముందుకు పడిపోయి మహాబసు కాళ్ళను పట్టుకున్నాడు.

"నమో దేవ మహాబసు. నమో దివ్య దక్షిణ హస్తే. నమో ప్రళయోద్యమ ప్రదీప్తనే. నమస్తే నమస్తే. నమస్తే నమః"

మహాబసుకి ఏం చెయ్యాలో పాలుపోలేదు. తేరుకున్న మరుక్షణం కిందకు వంగి ఆయన చేతులను పట్టుకోని పైకి లేపాడు.

"సిరిగిరిగారూ, ఏమిటీ పని. మీ వయసెక్కడ? నా వయసెక్కడ?"

"వయసుతో సంబంధం లేదు మహాబసు. నేను ఈ వయసుదాకా జీవించి వున్నానంటే దానికి కారణం మీ దర్శనం కోసమే అని అనుకుంటున్నాను. నా జన్మ ధన్యమైనట్లుగా భావిస్తున్నాను." అంటూ ఆయన స్థానంలో కూర్చున్నాడు.

"నన్ను చర్చకు పిలిపించింది నన్ను వ్యతిరేకించడానికి అనుకున్నాను కానీ నన్ను ఇలా దేవుణ్ణి చేస్తారని అనుకోలేదు" మహాబసు ఇబ్బందిపడుతూ తన ఆసనం పైన కూర్చున్నాడు.

"నిన్ను వ్యతిరేకించాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. నిన్ను ఒప్పించే ప్రయత్నమే తప్ప. అది కూడా నేను వున్న పదవి కారణంగా అనివార్యమైంది. నన్ను నమ్ముకున్న వాళ్ళకోసం తప్పడం లేదు" నవ్వాడాయన.

"మీరు నన్ను ఒప్పించే ప్రయత్నంలో కృతకృత్యులైతే నేను ఉద్యమాన్ని ఆపేస్తాను. అలా ఆపాను అంటే మీరు అనుకుంటున్న దేవుణ్ణి కాకుండా పోతాను. రెండింటిలో ఏదో ఒకటే జరిగే అవకాశం వుంది. నేను మీరు అనుకుంటున్న మహాబసుని కావచ్చు కాకపోవచ్చు."

"నిజమే"

"అప్పుడు మీరు నాకు పెట్టిన నమస్కారం వృథా అయ్యే అవకాశం వుంది" మహాబసు చిరునవ్వు నవ్వాడు.

"మీరు దేవుడి అవతారం అయితే అయ్యుండచ్చు, కాకపోతే కాకపోయి వుండచ్చు. కాకపోతే నమస్కారం వృథా కూడా కావచ్చు. కానీ, ఒక వేళ మీరే నేను నమ్మిన మహాబసు అయ్యుండి, నేను మీకు నమస్కరించకుండా పంపిస్తే నేను కోల్పోయేది దాని కన్నా ఎక్కువ. అందుకే నమస్కరించాను"

"ఇంకా మీలో అనుమానం వుంది అయితే" నవ్వేశాడు మహాబసు.

"డబ్బుతో దశాబ్దాలు గడిపిన మెదడు మీరు దేవుడు కాకూడదనే కోరుకుంటోంది. కానీ ఆధ్యాత్మిక చింతన వైపు మళ్ళిన మనసు మీరే మహాబసు అని పదే పదే చెప్తోంది." ఆయన కళ్ళలో భక్తి చూసిన మహాబసుకి ఇంక ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

"విషయానికి వద్దాం. మీరు చెప్పదల్చుకున్నదేదో చెప్పండి" అన్నాడు మహాబసు సూటిగా. సిరిగిరి ఓ అర నిముషం ఏం మాట్లాడలేదు. చెప్పాలనుకున్నది మనసులో సమీకరించుకుంటున్నట్లుగా వుండిపోయాడు.

సరిగ్గా అదే సమయంలో సిరివరం, సిరిచరం గుర్రాలపై దళాధిపతి వుండే ప్రాంతం వైపు దూసుకెళ్తున్నారు.

<★>

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS